సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 22 । ఆగస్టు । 2024



9 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు

భాకరాపేట బీటులోని మర్రిమాను శిల అటవీ ప్రాంతంలో 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, 9 మంది స్మగ్లర్‌లను అటవీ అధికారులు అరెస్టు చేశారు. -8లో



ఆక్రమణలపై కదలిక!

నందలూరులో జాతీయరహదారి ఆక్రమణలపై నేషనల్ హైవే ఆఫ్ అధారిటీ ఇండియా అధికారుల్లో కదలిక వచ్చింది. బుధవారం అధికారులు నిర్మాణాలను పరిశీలించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.280
రెండోరకం	రూ.150	రూ.220



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 520 మెట్రిక్ టన్నులు


పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	360	425
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 204.200 కిలోలు

బాలాజీ పట్టాలెక్కేనా!



తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ప్రతిపాదనకు రైల్వే శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా.. ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరుతుందా.. ఎంపీలందరూ ఉమ్మడిగా కృషి చేస్తే.. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కలిసి వస్తే 'బాలాజీ'పట్టాలెక్కిన ట్లేనంటున్నారు రైల్వే నిపుణులు. తాజాగా విశాఖ జోన్ ఏర్పాటుతో బాలాజీ డివిజన్‌పై ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.

- విశాఖజోన్ ఏర్పాటుతో సర్వత్రా చర్చ
- బాలాజీ డివిజన్ ప్రతిపాదనపై ఆశలు
- జిల్లాకు దూరాభారమైన గుంతకల్
- సెప్టెంబరు 4న రైల్వేశాఖతో ఎంపీల సమావేశం



బాలాజీ డివిజన్ కేంద్రంగా తిరుపతి రైల్వేకేంద్రం

రాజంపేట: తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ప్రతిపాదనకు రైల్వే అధికారులు పచ్చజెండా ఎప్పుడూపుతారోనని ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లా వాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. డివిజన్ కేంద్రంగా తిరుపతిని చేస్తే కాట్పాడి నుంచి గుంతకల్, నెల్లూరులో గూడూరు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లా పరిధిలో 700 కిలోమీటర్ల దూరం వస్తుంది. 400 కిలోమీటర్ల ఉంటే డివిజన్‌గా ప్రకటించవచ్చునని రైల్వే నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాజాగా విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ప్రకటించిన నేపథ్యంలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అదే సమయంలో తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్‌ను ఏర్పాటుచేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. తూర్పుకోస్తా పరిధిలోని వాల్తేరు డివిజన్‌లో కొంతభాగం విశాఖ రైల్వేజోన్‌లో కలపడం కన్నా, తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్‌గా చేయాలని సీమ వాసుల నుంచి కేంద్రానికి వినతులు వెళ్తున్నాయి. పైగా బాలాజీ డివిజన్ చేయాలని ఎన్నో ఏళ్లగా ప్రతిపాదన ఉంది.

గుంతకల్‌కు వెళ్లాలంటే దూరాభారం....

ప్రస్తుతం డివిజన్ కేంద్రంగా గుంతకల్ ఉంది. దీంతో తరచూ సమావేశాలకు గుంతకల్ డివిజన్ కేంద్రానికి వెళ్లి రావాలంటే అధికారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్, గుంటూరు, విజయవాడ డివిజన్లతోపాటు కొత్తగా బాలాజీ డివిజన్ ఏర్పాటుచేసి విశాఖజోన్‌లో కలిపితే బాగుంటుందని రైల్వే నిపుణులు అంటున్నారు. ఆ దిశగా ఎంపీలు రైల్వేమంత్రిత్వశాఖపై ఒత్తిడి తీసుకురావాలని సీమవాసులు కోరుతున్నారు.

కొత్త డివిజన్ ఏర్పడితే నందలూరుకు పూర్వ వైభవం..

కొత్త డివిజన్ ఏర్పడితే బ్రిటిష్ కాలం నాటి నందలూరు రైల్వే కేంద్రం పూర్వవైభవం సంతరించుకుంటుంది. బాలాజీ డివిజన్ కేంద్రానికి దగ్గరలో ఉన్న రేణిగుంట జంక్షన్ తర్వాత నందలూరు రైల్వే కేంద్రం రైల్వేపరమైన ప్రాముఖ్యత కలిగి ఉంది. డివిజన్‌కు రైల్వే ప్రత్యామ్నాయ పరిశ్రమను ఏర్పాటుచేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో రైల్వేమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ స్వయంగా రాజ్యసభలో నందలూరులో రైల్వేపరిశ్రమను ఏర్పాటును ప్రకటించిన సంగతి తెలిసిందే. విశాఖ జోన్ ఏర్పడిన నేపథ్యంలో గుంతకల్ డివిజన్ నుంచి వేరుచేసి కడప (ఉభయజిల్లాలు) వరకు బాలాజీ డివిజన్‌గా ఏర్పాటుచేసే ప్రతిపాదన కార్యరూపం దాల్చేందుకు పాలకులు నడుంబిగించాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందంటున్నారు రైల్వేనిపుణులు.

సెప్టెంబరు 4న ఎంపీలతో సమావేశం..

విజయవాడలో సెప్టెంబరు 4న ఎంపీలతో సమావేశం నిర్వహించేందుకు రైల్వే ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు 1వతేదిలోపు ఎంపీల నుంచి ప్రతిపాదనలు, హాల్టింగ్, కొత్తరైళ్ల, కొత్త రైలుమార్గాలు, ప్రయాణికుల సమస్యల తదితర గురించి లేఖలు తీసుకుంటున్నారు. ఉభయవైఎస్సార్, అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎంపీలు బాలాజీ డివిజన్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని బాలాజీ డివిజన్ పరిధిలోకి వచ్చే ప్రాంతీయులు కోరుతున్నారు. ప్రత్యేకంగా రైల్వేమంత్రిత్వశాఖ ఏర్పాటుచేయనున్న సమావేశంలో ఎంపీలు బాలాజీ డివిజన్‌పై గళం విప్పాలని, ఇదే మంచి సమయమని రైల్వేనిపుణులు అంటున్నారు. విశాఖ జోన్ ఏర్పాటు నేపథ్యంలో బాలాజీ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉంది. మరి కూటమి పాలకులు ఈ విషయాన్ని ఎంత బాధ్యతగా తీసుకుంటారో చూడాలి.

▶▶ బాలాజీ డివిజన్ ఏర్పాటైతే..

బాలాజీ డివిజన్ ఏర్పాటైతే ఇందులో తిరుపతి–గూడూరు (92.96కిమీ), తిరుపతి–కాట్పాడి (104.39కిమీ),పాకాల–మదనపల్లె (83కిమీ), రేణిగుంట–కడప (125కిమీ)లైను కలిపే అంశాన్ని గతంలోనే రైల్వే అధికారులు పరిశీలించారు. నంద్యాల–పెండేకల్లు (102కిమీ)లైను గుంటూరు డివిజన్‌లోకి విలీనం చేయాలని పరిశీలించారు. కాగా జిల్లా మీదుగా వెలుగొండ అడవుల్లో నుంచి వెళ్లే కృష్ణపట్నం రైల్వేలైన్ కూడా విజయవాడ డివిజన్‌లోకి వెళ్లింది.

బాలాజీ డివిజన్ ఏర్పాటు అవసరం



బాలాజీ డివిజన్ ఏర్పాటు ఎంతైనా అవసరం. విశాఖ జోన్ ఏర్పడుతున్న క్రమంలో కొత్త డివిజన్లను ఏర్పాటు చేయాల్సి వస్తే అది ముందుగా బాలాజీ డివిజన్ ఉంటుందని భావిస్తున్నాను. డివిజన్ కావడానికి అన్ని అర్హతలు బాలాజీ డివిజన్‌కు ఉన్నాయని రైల్వే నిపుణులు భావన. డివిజన్ ఏర్పాటు కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. ఇది అందరికీ ఉపయోగకరం. కేంద్ర రైల్వేమంత్రిత్వశాఖ ఆ దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేస్తున్నా.

–పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

ఇది దశాబ్దాల కాలం నుంచి ఉండే ప్రతిపాదన



గుంతకల్ డివిజన్ నుంచి వేరుకాబడి బాలాజీ డివిజన్ ఏర్పాటైతే నందలూరుకు మళ్లీ పూర్వవైభవం సంతరించుకున్నట్లే. రైల్వేపరిశ్రమ పెట్టేందుకు మార్గం సుగమమవుతుంది. బాలాజీ డివిజన్‌లో రేణిగుంట తర్వాత ప్రాముఖ్యత కలిగిన రైల్వేకేంద్రం నందలూరు. అంతేగాకుండా గుంతకల్‌కు వెళ్లాలంటే దూరాభారం. తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ అనుకూలం. ఈ డివిజన్ ప్రతిపాదన దశాబ్దాల కాలం నాటిది. విశాఖజోన్ ప్రకటనతో బాలాజీ డివిజన్ ప్రతిపాదనపై ఆశలు రేకేత్తాయి.

–మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు



కడప లగాడీలో విద్యుత్ తీగ తగిలి మృతిచెందిన విద్యార్థి ఖురేషి తంజువుర్ రహిమాన్



ఈ ప్రాణం ఖరీదెంత?

మధ్యాహ్నం ఒంటిగంట సమయం..
బడి గంట కొట్టగానే వడివడిగా
బయటికొచ్చారా దోస్తులు..
రోజులాగే ఒకే సైకిల్‌పై
ఇళ్లకు బయలుదేరారు..
చక్రాలు జోరుగా
ముందుకు కదిలాయి..
కాళ్లు చేతులూ ఆడిస్తున్నారు..
ఎప్పట్లాగే ఏంచక్కా
ముచ్చట్లాడుతున్నారు..
నవ్వుతూ.. తూలుతూ
ముందుకు సాగుతున్నారు...

ఒక్క క్షణం.. ఒకే ఒక్క క్షణం..
తలో దిక్కు పడ్డారు..
అందాక ఆడిన ఆ కాళ్లూ చేతులు
కదలకుండా పడి ఉన్నాయి..
మాటలు మూగబోయాయి..
నవ్వులు ఎప్పుడో
మాయమయ్యాయి..
ఉన్నట్లుండి చిన్నారుల శరీరంపై
మంటలు..

ఏమైంది..
ఏమవుతుంది....
ఆ పాత కథే..
ప్రజా భద్రత ప్రశ్నార్థకంగా మారి..
తీగలా అల్లుకుపోయిన
నిర్లక్ష్యపు కథే...

అధికారుల అలసత్వం అనాలా..
ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం అనాలా..
ఎవరినంటేనేం.. ఏమంటేనేం..
వందేళ్లు బతకాల్సిన
ఓ నిండు ప్రాణం
మొగ్గలోనే నేల రాలింది...
'ఊపిరి' పోసుకునేందుకు
మరో ప్రాణం తల్లడిల్లుతోంది....

పాపం ఎవరిది...?
శిక్ష ఎవరికి..?
రోడ్లపై గుంతలా పూడ్చరు..
మురుగు కాలువ వైపు
అస్సలు తొంగి చూడరు..
గజిబిజిగా కరెంటు వైర్లు..
గందరగోళంగా కనెక్షన్లు..
పని పనికో ఖరీదు కడతారు...
ప్రతి సర్వీసుకో బేరమాడతారు!

ఈ నిండు ప్రాణం ఖరీదెంత?
ఆ కుటుంబం
జీవితాంతం పడే వేదనంత!
పిల్లాడొస్తాడని గుమ్మం కాడే
నిలబడి చూసే తల్లి
ఎదురుచూపులంత!

ఈ నిర్లక్ష్యం వెల ఎంత?
పోయిన ప్రాణాన్ని
తిరిగి తీసుకురాలేనంత..
జీవించే హక్కును కాలరాసేంత...

నిన్న మురుగు కాలువ..
నేడు కరెంటు తీగ..
పిల్లల పాలిట
మృత్యు పాశాలవుతున్నాయ్..
తల్లిదండ్రుల జీవితానికి సరిపడా
చేదు జ్ఞాపకాలు మిగిలిస్తున్నాయ్..

కాటేసిన కరెంటు తీగ -8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం: స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి తెలిపారు. బాటని, ఎంఎల్‌టీ, జీఫ్‌సీ సబ్జెక్టులు బోధించడానికి అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 23వ తేది ఉదయం 10 గంటలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు బాలాలయం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో సెప్టెంబర్ 6 నుంచి 8వ తేది వరకు బాలాలయం జరగనుందని టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి తెలియజేశారు. సెప్టెంబర్ 6వ తేది సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారని, గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం బాలాలయం చేపడతారన్నారు. ఇందుకోసం ఆలయంలోని మండపంలో నమూనా ఏర్పాటు చేసి గర్భాలయంలోని మూలవర్ణ చిత్రపటాలను ఏర్పాటు చేయనున్నారు. ఆలయంలోని యాగశాలలో సెప్టెంబర్ 7వ తేది, 8వ తేది ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల మధ్య తులా లగ్నంలో బాలాలయం సంప్రోక్షణ నిర్వహించనున్నారు.

24,25న క్రికెట్ జట్టు ఎంపిక

వాల్మీకిపురం: ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14 ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయకుమార్ బుధవారం తెలిపారు. మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.

24న మినీ జాబ్ మేళా

రాయచోటి టౌన్: రాయచోటి పాలిటెక్నికల్ కళాశాలలో ఈ నెల 24వ తేది శనివారం మినీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన వారు ఉండాలని, వయస్సు 18 –30 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. ఎంపికై న అభ్యర్థులకు అర్హతను బట్టి రూ.18 వేల నుంచి రూ25 వేల వరకు ఉంటుందని అన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రాయచోటి (జగదాంబసెంటర్): జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో అంతరిక్ష దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

పారిశ్రామిక వేత్తలకు శిక్షణ తరగతులు

జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సూరిబాబు



శిక్షణలో సూచనలు, సలహాలు ఇస్తున్న జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సూరిబాబు

రాయచోటి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సూరిబాబు తెలిపారు. రాయచోటి పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ప్రారంభించిన మూడు రోజుల శిక్షణ తరగతులను వారు ప్రారంభించారు. శిక్షణలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారవడానికి కావాల్సిన మెలకువలు, వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై, మహిళలు వ్యాపారంలో రాణించడానికి కావాల్సిన వివిధ రకాల అనుమతులు గురించి తెలియజేశారు. సమావేశంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వ్యాపార అవకాశాలు గురించి ప్రాజెక్టు రిపోర్టు తయారీ, నిర్వహణ, శక్తి సామర్థ్యం గురించి, ఖాతా పుస్తకాలు నిర్వహణ తదితర పూర్తి సమాచారాన్ని తెలియజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి బి.హరికృష్ణ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల సహకారంతో జిల్లాలో చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగ మహిళలకు ఔత్సాహిక వ్యాపారవేత్తలకు మూడు రోజులపాటు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు.ఎస్ఎస్‌జీ లోన్, మెప్మా డీఆర్‌డీఏ డిపార్టుమెంట్‌ల సహాయ సహకారాలతో శిక్షణ పొందుతున్న మహిళలకు సర్టిఫికెట్లు బ్యాంకు రుణ సౌకర్యం కూడా కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు ఉత్సాహవంతులైన మహిళలు 30 మంది పాల్గొన్నారు. శిక్షణలో ఐఎల్‌ఓ మాస్టర్ ట్రైనర్, ఏపీ ఎస్ఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్య బాధిత గ్రామాల్లో రీసర్వే

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి
- డిప్యూటీ సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



పులపత్తూరు గ్రామంలో కలియతిరుగుతున్న కలెక్టరు శ్రీధర్ చామకూరి, సబ్‌కలెక్టర్ నైదియాదేవి

రాజంపేట: అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి దెబ్బతిన్న ఐదు గ్రామాల్లో రీసర్వే చేయించి, ఇంకా నష్టపరిహారం అందాల్సిన బాధితులు ఎవరైనా ఉంటే నమోదు చేస్తామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. బుధవారం రాజంపేట మండలం పులపత్తూరు గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలలో నష్టపోయిన బాధితులకు ఏదేని పరిహారం అందాల్సి ఉంటే ప్రభుత్వానికి నివేదించి పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చామన్నారు. ఈనెల 23న పులపత్తూరు గ్రామాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సందర్శించే అవకాశం ఉందన్నారు. ఆయన పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి అధికారులకు పలుసూచనలు చేశారు. కలెక్టర్‌తోపాటు సబ్‌కలెక్టరు నైదియాదేవి, హౌసింగ్ పీడీ శివయ్య, టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తిజగన్‌మోహన్‌రాజు, సర్పంచి ప్రతినిధి జగన్ పాల్గొన్నారు.

గ్రామంలో కలియతిరిగిన కలెక్టర్

పులపత్తూరు గ్రామంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి కలియతిరిగారు. గ్రామస్తులతో భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణప్రగతి గురించి ఆరా తీశారు. రైతులకు నష్టపోయిన పంట వివరాలను, రావాల్సిన పరిహారం తదితరం గురించి అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, నీటిసౌకర్యం, విద్యుత్ తదితర సౌకర్యాలు గురించి కలెక్టరు గ్రామస్తుల నుంచి గ్రౌండ్‌రిపోర్టు తీసుకున్నారు.

డామిట్... కథ అడ్డం తిరిగింది!

- పాత్రధారులు సరే...సూత్రధారులు ఏరీ
- 12 లారీలకు రూ. 24 లక్షల జరిమానా
- రాత్రికి రాత్రి బాడుగ లారీలతో ఇసుక తరలింపునకు ప్రణాళిక
- గ్రామస్తుల తిరుగుబాటు.. పోలీసుల రాకతో వెనక్కి తగ్గిన తమ్ముళ్లు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

సాక్షి రాయచోటి: తెలుగుదేశం పార్టీ నాయకులు రోజురోజుకు బరి తెగిస్తున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా అడుగులేస్తున్నారు. ఇందులో భాగంగా అధికారంలోకి రావడం ఆలస్యం ఇసుక దోపిడీ మార్గాన్ని ఎంచుకున్నారు. చెయ్యేరును చెరబట్టడానికి కూటమి నేతలు కుట్ర చేశారు. రోజుల తరబడి తోలడం కంటే ఒకటి, రెండు రోజుల్లోనే మొత్తం చక్కబెట్టాలని పథక రచన చేశారు. రాత్రికి రాత్రి ఇసుకను తరలించి ఆర్థికంగా బలపడాలని స్కెచ్ చేశారు. పెద్ద ఎత్తున బాడుగ లారీలు సిద్ధం చేశారు. కానీ జనాల తిరుగుబాటుతో తమ్ముళ్లు వేసిన కథ అడ్డం తిరిగింది. పోలీసులు రంగప్రవేశం చేయడంతో బాడుగ వాహనాలన్నింటినీ రాత్రికి రాత్రి ఎక్కడికక్కడ నిలిపి వేసి వెనక్కి పంపించాల్సిన పరిస్థితి వచ్చింది. పెనగలూరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఇసుక అక్రమ వ్యవహారంలో పట్టుబడిన 12 వాహనాలకు సంబంధించి దాదాపు రూ. 24 లక్షలు జరిమానా విధించచారు. జంకిన టీడీపీ నేతలు చడీ చప్పుడు లేకుండా మిగిలిన వాహనాలను మళ్లించారు.

పాత్రధారులు సరే...సూత్రధారులు ఏరీ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎక్కడికక్కడ స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుకను దోచేస్తున్నారు. చెయ్యేరు పరివాహక ప్రాంతాల పరిధిలో ఉన్న ఇసుకను అక్రమార్కులు అడ్డంగా తరలిస్తున్నారు. ముఖ్యంగా రాత్రికి రాత్రి చెయ్యేరును చెరబడుతున్నారు. రాత్రింబవళ్లు ఇసుకను తరలించసాగారు. వాహనాల బెడద అధికం కావడంతో పల్లెల్లో నిద్ర కూడా లేకపోవడంతో ప్రజలు చైతన్యవంతులు అవుతున్నారు. మూడు రోజుల కిందట జిల్లాలోని పెనగలూరు పరిధిలోని నారాయణ నెల్లూరు వద్ద కొంతమంది టీడీపీ నేతలు పంపించిన టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. అంతేకాకుండా ఇష్టానుసారం ఇసుక తోలుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సుమారు 12 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. వాటికి మరుసటిరోజే ఒక్కో వాహనానికి రూ. 2 లక్షలు చొప్పున రూ. 24 లక్షలు జరిమానా విధించారు. అయితే లారీలను పట్టుకోవడమే కాదు...లారీల వెనుక ఉన్న ఇసుకాసురులెవరో తేల్చాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. లారీ డ్రైవర్లు, వాహనాల యజమానులే కాకుండా వారి వెనుకున్న అసలు సూత్రధారులను కనిపెట్టాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

▶▶ గుట్టుచప్పుడు కాకుండా వాహనాల మళ్లింపు

మూడు రోజుల కిందట నారాయణ నెల్లూరు వద్ద ముందుగా కొన్ని వాహనాలు మాత్రమే చెయ్యేరు వైపు వచ్చాయి. ఇంకా వెనుకవైపు అనేక వాహనాలు ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఇక్కడ గ్రామస్తుల తిరుగుబాటుతో పాటు పోలీసుల రంగప్రవేశంతో వాహనాలను వెనక్కి మళ్లించినట్లు తెలియవచ్చింది. తెలుగు తమ్ముళ్లకు అనుకోని సంఘటన నారాయణ నెల్లూరు వద్ద ఎదురు కావడంతో చెయ్యేరు నదిలోకి ఇసుకకోసం వెళ్లే వాహనాలను రాత్రికి రాత్రే రహస్య ప్రాంతాలకు మళ్లించినట్లు చర్చ కొనసాగుతోంది. పైగా నారాయణ నెల్లూరు వ్యవహారంతో చెయ్యేరు పరివాహక ప్రాంతంలోని గ్రామాల నుంచి ఇసుకను తరలించేందుకు కొంతమేర అక్రమార్కులు జంకుతున్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా అమర్‌నాథ్‌రెడ్డి

- వైయస్‌ఆర్ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి
- జిల్లా జెడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా బ్రహ్మంగారి మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి



అమర్‌నాథ్‌రెడ్డి



పి.రవీంద్రనాథ్‌రెడ్డి

రాయచోటి: వైఎస్సార్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన పార్టీ నాయకులతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల పార్టీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలన్నదానిపై ఆయన వారితో చర్చలు జరిపి ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే వైఎస్సార్ జిల్లా జడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా బి.మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.



రామగోవిందరెడ్డిని అభినందిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు

క్లుప్తంగా

మసీదు మౌజన్‌కు తీవ్ర గాయాలు



గాయపడిన అహ్మద్‌ఖాన్

మదనపల్లె : మద్యం మత్తులో ఓ యువకుడు ద్విచక్ర వాహనంలో వెళ్లి మసీదు మౌజన్‌ను ఢీకొన్న సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీ సాగిబండవారిపల్లె మసీదులో మౌజన్‌గా పనిచేస్తున్న ఎం అహ్మద్ ఖాన్ (75)బి కొత్తకోటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం బైక్‌లో సాగిబండ వారి పల్లెకు వచ్చేందుకు బయలుదేరాడు. కురబలకోట మండలం అంగళ్లు వద్ద, మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి అహ్మద్ ఖాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో అహ్మద్ ఖాన్ కుడికాలు, చేయి విరిగాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



యశ్వంత్ నాయక్ (ఫైల్)

సుండుపల్లె : మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ, వంక బిడికికి చెందిన మూడే యశ్వంత్ నాయక్ (24) తమిళనాడు సరహద్దులో జరిగిని రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు యశ్వంత్‌నాయక్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. బైక్‌లో పాండిచ్చేరికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో యశ్వంత్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుని తండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు.

ఆటో ప్రయాణికులను ఢీకొన్న స్కూటర్



గాయపడ్డ సెహన్‌తాజ్

చిన్నమండెం : ఆటో దిగి చిల్లర ఇస్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న స్కూటర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లపల్లె గ్రామానికి చెందిన షేక్ సెహన్‌తాజ్ ఆడపడుచు ఇళ్ల అయిన చిన్నమండెం మండలం తూర్పుపల్లెకు ఆటోలో వచ్చి దిగి డబ్బులు ఇస్తుండగా వెనుక వైపు నుంచి స్కూటరిస్టు వచ్చి ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో సెహన్‌తాజ్‌కు కాళ్లు విరగ్గా, ఆటో డ్రైవర్ ఇమ్రాన్‌కు నడుము విరిగినట్టు చెప్పారు. అదే విధంగా మరో ప్రయాణికుడు శివకు కాలు గాయాలు కాగా సెహనాజ్ ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సాయంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కాటేసిన కరెంట్ తీగ

- కరెంట్ వైర్లు తగిలి విద్యార్థి దుర్మరణం
- మరో విద్యార్థికి తీవ్రగాయాలు
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణం



ఖురేషి తంజువుర్ రహిమాన్ మృతదేహం



తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న అద్నాన్



సంఘటన స్థలం



కడపలోని హోలిస్టిక్ ఆసుపత్రి వద్ద జనం

కడప అర్బన్ : తెలిసీ తెలియని వయసు పిల్లలు ఇద్దరు చెట్టాపట్టాలు వేసుకుని సైకిల్‌లో మధ్యాహ్నం తాము చదువుతున్న పాఠశాల నుంచి ఇంటికి బయలు దేరారు. విద్యుత్ సరఫరా ఉన్న కరెంట్ లైన్‌కున్న తీగ వేలాడుతూ వీరికి చుట్టుకుంది. అంతే తమకు తెలియకుండానే ప్రమాదానికి గురయ్యారు. శరీరంపై యమపాశంలా విద్యుత్ తీగ పడుతుందని భావించలేకపోయారు. మంటలు చెలరేగాయి. వీరిద్దరి శరీరాలపై విద్యుత్ తీగ పడిన ప్రదేశమంతా కాలిపోయాయి. ఆ సమయంలో అదే వీధిగుండా ద్విచక్రవాహనంలో వస్తున్న వ్యక్తి వెంటనే ఈ దృశ్యాన్ని చూసి వెంటనే మరో వ్యక్తితో కలిసి కట్టెతో విద్యుత్ తీగను వేరు చేశారు. స్థానిక ప్రజల సహకారంతో ఇద్దరు పిల్లలను కడప నగరంలోని క్రిస్టియన్‌లైన్‌లో ఉన్న హోలిస్టిక్ హాస్పిటల్‌లో చికిత్స కోసం తరలించారు. సంఘటన స్థలాన్ని, ఆసుపత్రిని కడప టూటౌన్ సీఐ బి. నాగార్జున, ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్ తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

క్షణాల్లో సంఘటన ..

క్షణాలలోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో బెల్లంమండివీధిలో నివాసం ఉంటున్న అబ్దుల్ రహిమాన్ పెద్దకుమారుడు ఖురేషి తంజువుర్ రహిమాన్ (11) హాస్పిటల్‌కు తీసుకొచ్చిన కొంతసేపటికి మృతి చెందాడు. మరోబాలుడు ఆటోడ్రైవర్ అజ్మత్‌ఆలీ చిన్నకుమారుడు షేక్ అద్నాన్ (11) తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరు సైకిల్‌పై ప్రతి రోజూ తమ ఇంటి నుంచి బయలుదేరి రోడ్డుకు అవతలవైపు ఇంటర్నేషనల్ కల్యాణమండపం సమీపంలో ఉన్న విద్యాసాగర్ స్కూల్‌లో ఐదోతరగతి చదువుతున్నారు. బుధవారం కూడా సైకిల్‌పై తమ స్కూల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో టైటానిక్ బిల్డింగ్ లైన్‌లో విద్యుత్ తీగ వేలాడుతూ ఉండటం గమనించలేకపోయారు. విద్యుత్ తీగ తగలడంతోనే సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు కుప్పకూలిపడిపోవడం, మంటలన్నీ వ్యాపించడం క్షణాల్లో జరిగిపోయాయి. విద్యుత్ అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యమే ఈ విషాద ఘటనకు కారణమని స్పష్టంగా తెలుస్తోంది.

విద్యుత్ ప్రమాదం సంఘటనపై జిల్లా విద్యాశాఖాధికారి మర్రెడ్డి అనురాధ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాద సంఘటన వివరాలను కడపలోని హోలిస్టిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి అద్నాన్ తండ్రి అజ్మత్ అలీని, కుటుంబ సభ్యులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

నా కుమారుడిని బ్రతికించండి సార్ : అద్నాన్ తండ్రి



నా కుమారుడు అద్నాన్, తన స్నేహితుడు రహిమాన్‌తో కలిసి ఐదోతరగతి చదువుతున్నాడు. ఇద్దరు కలిసి మెలిసి సైకిల్‌లో స్కూల్‌కు వెళ్లి వచ్చేవారు. అలాంటిది కరెంట్ తీగ తగిలి రహిమాన్ చనిపోవడం, తన కుమారుడు తీవ్రంగా గాయపడటం బాధాకరం. నా కుమారుడిని ఎలాగైనా బ్రతికించండి అంటూ వైద్యులను వేడుకుంటున్నాడు.

స్పెషల్ డ్రైవ్ ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారిస్తాం - ఎమ్మెల్యే మాధవి



కడప నగరంలో ఇష్టానుసారంగా రోడ్లకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలతోపాటు, ఇతర సంస్థలకు సంబంధించిన వైర్లు కూడా చుట్టి ఉన్నాయనీ తమ పరిశీలనలో తేలింది. స్పెషల్ డ్రైవ్ ద్వారా అడ్డదిడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను, విద్యుత్ స్థంభాలను విద్యుత్ అధికారుల ద్వారా తొలగింపచేస్తాం. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. విద్యార్థి మృతికి వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. ప్రభుత్వం వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి



మాట్లాడుతున్న కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, బాలస్వామిరెడ్డి

కడప కార్పొరేషన్ : విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ఇంటర్నేషనల్ కళ్యాణ మండపం వద్ద విద్యుత్ వైర్లు తెగిపోయి ఒక విద్యార్థి చనిపోయాడని, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డారని కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, ఎం. బాలస్వామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కరెంటు తీగలు కిందకి వేలాడుతున్నా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి రూ.20లక్షలు, గాయపడిన విద్యార్థి కుటుంబానికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి వరకుమార్ పాల్గొన్నారు.

జాతీయరహదారి ఆక్రమణలపై కదలిక!

సాక్షి ఎఫెక్ట్..



కడప-రేణిగుంట ఎన్‌హెచ్‌ఏఐ రోడ్డులో ఆక్రమణకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

రాజంపేట : నందలూరులో జాతీయరహదారి ఆక్రమణలపై నేషనల్ హైవే అథారిటి ఇండియా అధికారుల్లో కదలిక వచ్చింది. దీనిపై ‘సాక్షి’లో మంగళవారం అసలే రద్దీ...ఆపై ఆక్రమణ అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో బుధవారం మండలరెవెన్యూ, పోలీసులు, సర్వే అధికారులు కడప-రేణిగుంట హైవేలోని నందలూరు బస్టాండుకు రాజంపేట వైపు, కడపవైపుల హైవే రోడ్డులోకి వచ్చిన నిర్మాణాలను పరిశీలించారు. రోడ్డు ఆక్రమణదారుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. కొందరు దర్జాగా ముందుకొచ్చి తమ సొంత స్థలం అంటూ ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అలాగే డబుల్‌రోడ్డు కాస్తా సింగల్‌రోడ్డుగా మారిపోవడంతో తరచూ వాహనాల బారులు తీరుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్న తరుణంలో రోడ్డు ఆక్రమణలు తొలిగింపు చర్యలు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చేపట్టనున్నారు. ప్రస్తుత హైవేరోడ్డు ఎన్‌హెచ్‌ఏఐలోకి బదలాయింపు జరిగింది.

రోడ్డునిర్మాణ తొలి మార్కింగ్ పరిశీలన

నందలూరు బస్టాండు సర్కిల్‌లో హైవే అధికారులు డబుల్‌రోడ్డు నిర్మాణ సమయంలో డీఎన్‌డీడీ చేసి స్థలాలను గుర్తించి మార్కింగ్ ఇచ్చారు. ఇప్పుడు ఆ మార్కింగ్ కనిపించకుండా చేశారు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలను యథేచ్ఛగా చేపట్టారు. దీంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తమ వద్ద నున్న రోడ్ వెడల్పు, స్థలానికి సంబంధించి రికార్డులను పరిశీలన చేయనున్నారు. పక్కా ఆధారాలతోనే ఆక్రమణలు తొలిగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఏటీఎంలలో రూ.13.21 లక్షలు మాయం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పలు ఏటీఎంలలో రూ.13.21 లక్షల నగదు మాయమైనట్లు సంబంధిత ఏజెన్సీ సిబ్బంది గుర్తించారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధి మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.బద్వేలు, కలసపాడు, పోరుమామిళ్ల ప్రాంతాల్లోని పలు బ్యాంకుల ఏటీఎంలలో సీఎంఎస్ సంస్థ నగదు జమ చేస్తోంది. సదరు సంస్థ నియమించిన సిబ్బంది ప్రతిరోజూ బ్యాంకులోకి వెళ్లి నగదు డ్రా చేసుకుని ఏటీఎంలలో జమ చేస్తుంటారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న రెండు ఎస్‌బీఐ ఏటీఎంలు, గుంతపల్లె క్రాస్‌రోడ్డులోని ఓ ఎస్‌బీఐ ఏటీఎంలలో జమ చేసిన నగదుకు సంబంధించి మంగళవారం నిర్వహించిన ఆడిట్‌లో రూ. 13.21 లక్షలు నగదు తేడా వచ్చినట్లు గుర్తించారు. సిబ్బంది నగదును జమ చేయకుండా దారి మళ్లించినట్లు గుర్తించారు. ఈ మేరకు నగదు జమ చేసే ఇద్దరు సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మదనపల్లెలో చోరీ

రూ. దాదాపు 15 లక్షల విలువైన నగలు నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిలో వస్తువులు పరిశీలిస్తున్న తాలూకా ఎస్ఐ రమణ.

మదనపల్లె : పట్టణ పరిసర ప్రాంతమైన దేవతానగర్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. దాదాపు రూ. 15 లక్షల విలువైన నగలు, నగదును దుండగులు అపహరించుకుని వెళ్లారు. సీటీఎం రోడ్డులోని రాజరాజేశ్వరి గుడి సమీపంలో ఉన్న దేవతానగర్ లో ఇమామ్ సాబ్ భార్య రెహానా (60) ఒంటరిగా ఇంట్లో ఉంటుంది. ఆమె భర్త ఇమామ్ సాబ్ కాంట్రాక్టర్ గా పని చేస్తూ మృతి చెందాడు. ఇద్దరు కుమారులు బెంగళూరులో ఉద్యోగాలు చేస్తూ అక్కడే ఉంటున్నారు. మంగళవారం రెహానా ఇంటికి తాళాలు వేసుకుని పులిచెర్ల మండలం కల్లూరు లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ విషయాన్ని పసిగట్టిన దుండగులు రాత్రి ఇంటి తలుపులు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా తెరిచి అందులో దాచిన దాదాపు 150–200 గ్రాముల వివిధ రకాల బంగారు ఆభరణాలు, రూ. 6లక్షల నగదు చోరీ చేసినట్లు బాధితురాలు రెహానా ఫిర్యాదులో పేర్కొన్నారు . అనంతరం పక్కనే ఉన్న కరీముల్లా ఇంటిలో సైతం దుండగులు చోరీకి పాల్పడ్డారు.అక్కడ కేవలం రెండు జతల దుస్తులు రూ. 1000 నగదు మాత్రమే చోరీకి గురైనట్లు తెలిసింది.బుధవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ రమణ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం సంఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహించి ఆధారాలు సేకరించారు. బాధితురాలు రెహానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

భార్య ఫిర్యాదు మేరకు ఆర్టీపీపీ జేపీఏపై కేసు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్ (జేఏపీ) గా పనిచేస్తున్న వై అంకన్నపై తన భార్య భానుప్రియాంక వేధిపులుకు గురి చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కలమల్ల ఎస్ఐ తిమోతి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఆర్టీపీపీలో వై అంకన్న జేపీఏగా పని చేస్తూ క్వార్టర్స్ ఎఫ్–87లో నివాసం ఉంటున్నాడు. భాను ప్రియాంక తన భర్త అంకన్న మానసికంగా, శారీరకంగా వేధింపులు గురి చేస్తున్నారని ఈ నెల 19వ తేదీన కలమల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.విచారణ జరిపి జేపీఏ అంకన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న పోస్టల్ ఎస్పీ రాజేష్ కుమార్

సుండుపల్లె : పోస్టల్ శాఖ అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డివిజనల్ పోస్టల్ ఎస్పీ రాజేష్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టల్ డిపార్టుమెంట్ సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డాక్ చోపల్ కార్యక్రమం ద్వారా ఇంటింటికి పోస్టల్ వినియోగాన్ని విస్తృతంగా పెంచాలన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు పోస్టల్ విధానంలో హెల్త్ పాలసీ, ప్రమాద బీమా సంవత్సరానికి రూ.559లు చెల్లిస్తే ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షలు బీమా వస్తుందని, అలాగే రూ.799లు చెల్లిస్తే రూ. 15 లక్షలు వరకు వస్తుందన్నారు. అలాగే ప్రధాన మంత్రి సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా 8.2శాతం వడ్డీ రేటు ఉందని, చదువుల కోసం, లేక వివాహాల సమయానికి డబ్బులు తీసుకునే విధంగా ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రామాలలోని ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని వారు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్, ఎంపీడీఓ రామచంద్ర, సుబ్రమణ్యం, పోస్టల్ ఆఫీసర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు

20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్‌లతో కడప అటవీ అధికారులు

సిద్దవటం : కడప రేంజ్ సిద్దవటం మండలం భాకరాపేట బీటులోని మర్రిమాను శిల అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, 9 మంది తమిళనాడుకు చెందిన స్మగ్లర్‌లను అరెస్టు చేశామని కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు కడప రేంజిలోని భాకరాపేట బీటు పరిసర ప్రాంతాల్లో మంగళవారం సిబ్బందితో విధులు నిర్వహిస్తుండగా ఎవరో మాట్లాడుకుంటున్న శబ్దాలు వినిపించాయన్నారు. మర్రిమానుశిల అటవీ ప్రాంతంలోకి వెళుతుండగా కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేసేందుకు ఫోర్డు ఎండోవర్ వాహనంలో లోడు చేస్తున్నారు. తమ సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేస్తుండగా వారిని చుట్టుముట్టి వారిపై దాడులు జరిపి అదుపులోకి తీసుకున్నారమన్నారు. అక్కడ లభ్యమైన 20 ఎర్రచందనం దుంగలను, ఫోర్డు ఎండోవర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన దేవరాజు పళనిస్వామి, ములకాడు గ్రామం, ధర్మపురి జిల్లా, సుబ్రమణి పళనియప్పన్, వెల్లివల్లాలు గ్రామం, సితిరి ధర్మవం జిల్లా, వెంకటరత్నమణిచిన్న వెల్లంపల్లి గ్రామం, సితిరి ధర్మవరం జిల్లా, బాక్యిరాజ్ గోవిందన్ వెల్లంపల్లి, రామచంద్రన్ వెల్లంపల్లి, అన్నామలై వెల్లంపల్లి, చంద్రకులన్ కున్నూర్ గ్రామం, జయరామన్ పొన్నన్ వెల్లంపల్లె, పెరుమాల్ దాసంగ్‌గుందార్, సేలం జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. వీరందరిని కోర్టులో హాజరు పరిచామని ప్రసాద్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల బరువు 484కిలోలు ఉండగా, వీటి ధర రూ. 2.26 లక్షలు చేస్తాయన రేంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాకరాపేట ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీటు అఫీసర్ గంగాధర్, ఎఫ్‌బీఓలు రాజశేఖర్‌రాజు, క్రిష్ణప్రసాద్, పార్వతి, ఏబీఓలు కిషోర్‌కుమార్, షాహినా బాను, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లి మండలంలో జరిగింది. వాల్మీకిపురం పట్టణం పింగాణి ఫ్యాక్టరీ సమీపంలో నివసిస్తున్న ఇటుక బట్టి కార్మికుడు నరసింహులు (59) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చి తిరిగి వాల్మీకిపురానికి వెళుతుండగా పూలవాండ్ల పల్లె వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రెడ్డెయ్య (ఫైల్)

రాయచోటి టౌన్ : యండపల్లె ముసలరెడ్డిగారిపల్లె సమీపంలో మంగళవారం అదే గ్రామానికి చెందిన చిన్న రెడ్డెయ్య (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి – గాలివీడు రోడ్డులోని ముసలరెడ్డిగారిపల్లె సమీపాన పొలాల్లో మృతదేహం చూసిన స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బుధవారం పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఆసుపత్రికి పంపారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మమ్మ ఆరు నెలల క్రితం భర్తతో విబేధించి పుట్టింటికి వెళ్లినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు.

బి.కొత్తకోట వద్ద రెండు లారీలు ఢీ

- బోల్తా పడి ధ్వంసం • ఏడుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో బోల్తాపడిన టమాటా లారీ

బి.కొత్తకోట : మండల కేంద్రం బి.కొత్తకోటకు సమీపంలోని టి.సదుం క్రాస్ వద్ద బుధవారం రాత్రి పదిన్నర గంటలకు రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుదురుగా వెళ్తున్న రెండు లారీలు ఢీకొనడంతో పూర్తిగా ధ్వంసమై బోల్తా పడ్డాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.మధ్యప్రదేశ్ కు చెందిన లారీలో గుమ్మడికాయలను కర్ణాటకలో లోడ్ చేసుకున్నారు. బి.కొత్తకోట మీదుగా అనంతపురం నుంచి మధ్యప్రదేశ్ వెళ్లేందుకు లారీ బయలుదేరింది. అదే సమయంలో ములకలచెరువు వైపు నుంచి కర్ణాటకలోని కోలార్ మార్కెట్ కు టమాటా లోడుతో లారీ బి.కొత్తకోట వైపుకు వస్తోంది. ఈ రెండు లారీలు టి. సదుం క్రాస్ వద్ద వేగంగా ఢీకొన్నాయి. ఈ వేగం కారణంగా ఢీకొన్న లారీలు బోల్తా పడ్డాయి. లారీల ముందు భాగాలు మొత్తం పూర్తిగా ధ్వంసం అయ్యాయి. టమాటాలు, గుమ్మడికాయలకు నష్టం వాటిల్లింది. టమాటా లారీలోని ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాలకు చెందిన, కర్ణాటకలోని కోలార్ కు చెందిన కృష్ణప్ప (53), ప్రభాకర్ (30), వెంకటేష్ (32), సురేంద్ర (32), హరి (19), మధ్యప్రదేశ్ కి వెళ్తున్న లారీ డ్రైవర్లు ధరం వీర్ (27), రాఘవేంద్ర (24)లు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం తర్వాత బాధితులను బి కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యురాలు హసీనా బేగం, సిబ్బంది క్షతగాత్రులకు సత్వరమే వైద్య సేవలు అందించారు. వీరిలో రాఘవేంద్ర, సురేంద్ర, ప్రభాకర్ల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గుర్తించి వారిని 108లో మదనపల్లెకు తరలించారు.





బోల్తా పడిన గుమ్మడికాయల లారీ, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఆధైర్యపడకండి అండగా ఉంటా



వైఎస్ జగన్‌తో దాసరి పెంచలయ్య కుటుంబసభ్యులు

దాసరి కుటుంబాన్ని అక్కున చేర్చుకున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన శవనవారిపల్లె పంచాయతీలోని లక్ష్మీంపల్లె దళితవాడకు చెందిన రాజంపేట జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి, ఆమె భర్త దళిత నేత దాసరి పెంచలయ్య కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకున్నారు. బుధవారం విజయవాడలో ఉభయ వైఎస్సార్‌జిల్లాల జెడ్పీటీసీల సమావేశానికి దాసరి కుటుంబసభ్యులు ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి నేతృత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా దాసరి పెంచలయ్యను ఆప్యాయంగా పలుకరించి, సాధకబాధలను విన్నారు. ఎన్నికల ముందు, ఆ తర్వాత పోలీసులు తనను ఏ విధంగా వేధించారో వివరించారు. తనపై రౌడీషీట్ ఓపెన్ చేసి జిల్లా బహిష్కరణ చేయడాన్ని వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. తనెంతో కష్టాలుపడ్డానని, ఆర్థికంగా చితికిపోయానని వాపోయారు. దాసరి మొదటినుంచి పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పని చేశాడని ఎమ్మెల్యే ఆకేపాటి వైఎస్ జగన్‌కు తెలియజేశారు. దీంతో వైఎస్ జగన్ దాసరితో ఆప్యాయంగా మాట్లాడుతూ నీకు, నీకుటుంబానికి నేను అండగా ఉంటాను, ధైర్యంగా ఉండు అంటూ భరోసా ఇచ్చారు. అనంతరం దాసరి కుటుంబసభ్యులను పలుకరించారు.